క్లుప్తంగా

మధ్యంతర భృతి ప్రకటించాలి

చాపాడు : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.శ్యాంసుందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అన్నవరం, లక్ష్మీపేటలోని జిల్లా ఉన్నత పాఠశాలలో గురువారం ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ మైనార్టీ కన్వీనర్ అఫ్సర్ పాషా, చాపాడు మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజారెడ్డి, మల్లికార్జున, జిల్లా కౌన్సిలర్లు జీపీ వెంకటేశ్వర్లు, వరప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాది నుంచి ఎడిఫై స్కూల్



ఫ్రాంచైజీ పత్రం అందుకుంటున్న అమర్‌నాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : దేశవ్యాప్తంగా పేరుగాంచిన ఎడిఫై పాఠశాలను వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రొద్దుటూరులో ప్రారంభిస్తున్నట్లు జీవన జ్యోతి విద్యాసంస్థల కరస్పాండెంట్ వై.అమర్‌నాథరెడ్డి తెలిపారు. పాఠశాలలో ఎడిఫై విద్యాసంస్థలతో ఫ్రాంచైజీ ధ్రువీకరణ పత్రాన్ని అడ్వయిజరి ప్రిన్సిపాల్ అజయ్‌లాల్ నుంచి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని కామనూరు సమీపంలో 10 ఎకరాల విస్తీర్ణంలో పాఠశాల ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎడిఫై ద్వారా అధునాతన విద్యా ప్రమాణాలతో నేటి సాంకేతిక విద్యా ప్రమాణాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా అత్యాధునిక టెక్నాలజీతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేస్తామన్నారు. విశాలమైన ఆటస్థలం, ఏసీ తరగతి గదులు, ఆహ్లాదకరమైన ప్రశాంత వాతావరణంలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తామన్నారు.

ఎస్సీలకు న్యాయం చేయాలి

ప్రొద్దుటూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఎస్సీలకు న్యాయం చేయాలని ప్రజా సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఎమ్మార్పీఎస్ (ఉసురుపాటి బ్రహ్మయ్య వర్గం) జిల్లా అధ్యక్షుడు నరసింహులు మాదిగ, రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ అగస్త్యేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి గదుల బాడుగుల విషయంలో ఎస్సీలకు 14.4 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సాయినాథరెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నమ్మ మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాసులు, బెనర్జీ పాల్గొన్నారు.

పంటల పరిశీలన

బ్రహ్మంగారిమఠం : మండలంలోని సోమిరెడ్డిపల్లె 1 గ్రామ రైతు సేవా కేంద్రం పరిధిలో గురువారం మండల వ్యవసాయ అధికారి కొత్తపల్లె ప్రవీణ్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది వరి, మిరప పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ సహాయకుడు సాయికుమార్, పశువైద్య సహాయకుడు రామసుబ్బారెడ్డి రైతులు పాల్గొన్నారు.

పీఆర్ ఈఈకి సన్మానం


ఈఈ నాగరాజును సన్మానిస్తున్న ఉద్యోగులు

బద్వేలు అర్బన్ : బద్వేలు డివిజన్ పంచాయతీ రాజ్ ఈఈగా పని చేస్తూ నంద్యాల ఈఈగా బదిలీపై వెళుతున్న కర్నాటి నాగరాజును గురువారం పీఆర్ డివిజన్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఈఈలు సూర్యనారాయణరెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, ఏడు మండలాల ఏఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యతోనే ఉజ్వల భవిష్యత్ చేకూరుతుందని ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు తెలిపారు. కల్లూరు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యావాహిని కాంపిటీషన్‌లో భాగంగా సీనియర్ విద్యార్థులకు వంట గదిలో ఔషధ మొక్కలు, జూనియర్ విద్యార్థులు-చుట్టుపక్కల దొరికే ఔషధ మొక్కల ప్రాజెక్టు వర్క్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎన్ఎంఎంఎస్ దరఖాస్తు చేసిన 13 మంది విద్యార్థులకు అవసరమైన మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్ వీరనారాయణ, ఉపాధ్యాయులు విజయమోహన్‌రెడ్డి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన

ప్రొద్దుటూరు : స్థానిక రాణితిరుమలదేవి డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్, వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ యనమల సిద్ధార్థ యాదవ్, డాక్టర్ పొలిమేర నరసింహ, కళాశాల ప్రిన్సిపాల్ టి.చంద్రశేఖర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, వికసిత ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శూలం లక్ష్మీదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీలు ప్రారంభం


బద్వేలు అర్బన్ : పరుగుపందెంలో పాల్గొన్న విద్యార్థినులు


అట్లూరు : విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఫణిశ్రీ

బద్వేలు అర్బన్ : నియోజకవర్గ స్థాయి అండర్-14, అండర్-17 బాలుర, బాలికల ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు గురువారం స్థానిక ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రారంభమయ్యాయి. అండర్-14 బాలికల విభాగం 100 మీటర్ల పరుగుపందెంలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.కె.జాస్మిన్ ప్రథమ స్థానం, కలసపాడు కేజీబీవీకు చెందిన షాహీన్ ద్వితీయ స్థానం, బీవీఆర్‌నగర్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన మోక్షిత తృతీయ స్థానంలో నిలిచారు. అండర్-17 బాలుర విభాగం హైజంప్‌లో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పి.చైతన్య ప్రథమ స్థానం, వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జి.వి.జైశ్యామ్ ద్వితీయ స్థానం, కలసపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కె.వినీత్ తృతీయ స్థానం పొందారు. అండర్-17 బాలికల లాంగ్‌జంప్‌లో బి.కోడూరు కేజీబీవీకి చెందిన ఎం.వి.సుజాత ప్రథమ స్థానం, పోరుమామిళ్ల కేజీబీవీకి చెందిన లావణ్య ద్వితీయ స్థానం, కలసపాడు కేజీబీవీకి చెందిన పి.శిరీష తృతీయ స్థానంలో నిలిచారు. అండర్-14 బాలుర విభాగం షాట్‌పుట్‌లో గోపవరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన మహబూబ్‌బాషా ప్రథమ స్థానం, గోవిందాయపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ప్రతాప్‌రెడ్డి ద్వితీయ స్థానం, కలసపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన రాజేష్ తృతీయ స్థానం సాధించారు.

కార్యక్రమంలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీ.వెంకటసుబ్బారెడ్డి, ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీల నియోజకవర్గ కన్వీనర్ సగిలిబాలయ్య, కో కన్వీనర్లు నాగేశ్వర్‌రావు, మహబూబ్‌బాషా, కొండయ్య, నియోజకవర్గంలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

అట్లూరు : తిరుపతిలో రెండు రోజుల క్రితం జరిగిన జాతీయ స్థాయి జూడో టోర్నమెంట్‌లో అట్లూరు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల విద్యార్థిని యక్ష ఉత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచిందని పాఠశాల ప్రిన్సిపల్ ఫణిశ్రీ తెలిపారు. అలాగే ఇటీవల కడపలో జరిగిన అండర్-14, అండర్-17 జిల్లా స్థాయి కుస్తీ పోటీల్లో గోపిక, తనూజ, కీర్తన, హిమశైలజలు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. వారిని గురువారం ప్రిన్సిపల్ ఫణిశ్రీ సన్మానించారు. పాఠశాల ప్రిన్సిపల్, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీల, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

దేవస్థాన భూమి ఆక్రమణకు యత్నం

రెవెన్యూ అధికారులకు యాదవుల ఫిర్యాదు

చాపాడు : మండల పరిధి నక్కలదిన్నె గ్రామంలోని యాదవుల కుటుంబాలకు చెందిన దేవస్థాన భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని యాదవులు గురువారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడిగా దేవాలయ అవసరాలకు అనంతపురం గ్రామ పొలంలోని సర్వే నెంబర్ 199-1బి2లో 3.63 ఎకరాల పొలం ఉందన్నారు. ఈ గ్రామ కంఠం భూమిని 1977లో అప్పటి ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి 6 సెంట్ల చొప్పున 60 కుటుంబాలకు పట్టాలు ఇచ్చిందన్నారు. 1985లో గ్రామంలో అగ్ని ప్రమాదం జరిగి ఇళ్లు పూర్తిగా కాలిపోగా వాటిలో పట్టాలు కూడా కాలిపోయాయన్నారు. ఇదే అదనుగా తీసుకుని ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ అనుచరుడైన గ్రామానికి చెందిన పామిడి రవీంద్ర యాదవ్ గ్రామ కంఠం భూమిని దౌర్జన్యంగా సేద్యం చేసుకుని పంట సాగు చేయాలని చూస్తున్నాడన్నారు. గ్రామానికి చెందిన పెద్ద మనుషులు చెప్పినప్పటికీ ఖాతరు చేయకుండా ఎమ్మెల్యే అండ చూసుకుని బాధితులపై రివర్స్ కేసులు పెట్టిస్తానని బెదిరింపులకు దిగుతున్నాడన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీసు అధికారులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలన్నారు. ఇదే క్రమంలో ఎమ్మెల్యే కూడా స్పందించి రవీంద్ర చెప్పే మాటలు వినకుండా గ్రామంలో విచారణ చేయించి యాదవ కుటుంబాలకు న్యాయం చేయాలని గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య, ప్రసాద్, ఆంజనేయులు, రవిశంకర్, రామసుబ్బయ్య, నాగరాజు, వెంకట రమణ రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

నేడు యువజన సమ్మేళనం

బద్వేలు అర్బన్ : రాచపూడి నాగభూషణం విద్యాసంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బొజ్జిరెడ్డి ఫంక్షన్ హాలులో యువజన సమ్మేళనం నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ రాచపూడి వెంకటసాయిక్రిష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి ప్రారంభమయ్యే ఈ సమ్మేళనంలో యువతకు దిశానిర్దేశం చేయడానికి హైదరాబాద్‌కు చెందిన సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ ఎం.బాలలత, రామకృష్ణ మిషన్ కార్యదర్శి అనుపమానందమహరాజ్, చిన్మయమిషన్ అధ్యక్షులు స్వామితురియానందసరస్వతి, అచలానంద ఆశ్రమ నిర్వాహకులు విరజానందస్వామి, ప్రముఖ ప్రొఫెసర్ ఆర్.ఓ.ఎల్.శర్మ, ఇంపాక్ట్ ట్రైనర్ కుమారి సంధ్యలు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని యువతీ యువకులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

30న కలెక్టరేట్ వద్ద ధర్నా

మైదుకూరు : రాష్ట్రంలో చేతి వృత్తుల వారి సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు జాతీయ చేతివృత్తుల ఐక్య వేదిక మైదుకూరు నియోజకవర్గ అధ్యక్షుడు గుడే నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని చేతివృత్తుల వారందరూ హాజరు కావాలని కోరారు.

పూడికతీత పనుల పర్యవేక్షణ

ప్రొద్దుటూరు : స్థానిక గోపిరైస్ మిల్ రోడ్డులో మురుగు కాలువల్లో మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది పూడికతీత పనులు చేపడుతున్నారు. గురువారం మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు, మేస్త్రీ ఐజయ్య పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనే లక్ష్యం

ప్రొద్దుటూరు క్రైం : ఎయిడ్స్ నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ నరేష్ కుమార్ తెలిపారు. జిల్లా హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు చైతన్య ఎడ్యుకేషనల్ అండర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో 'మీకు తెలుసా' అవగాహన కార్యక్రమాన్ని స్థానిక వసంతపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మౌనిక, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సీఈఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పుల్లయ్య, భాగ్య, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

స్పందన కరువు

బ్రహ్మంగారిమఠం : నూతన ప్రభుత్వం వంద రోజుల పాలనపై మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం గురువారం ముగిసింది. మండలంలో 11 గ్రామ పంచాయతీలలో జరిగిన గ్రామ సభలకు ఒక గ్రూపు టీడీపీ కార్యకర్తలు హాజరయ్యారు. అధికారులు సర్పంచ్, ఎంపీటీసీలకు సమాచారం లేకుండా నిర్వహించారు. దీంతో ప్రజల నుంచి స్పందన కరువైంది.

డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా మందులివ్వద్దు

ప్రొద్దుటూరు క్రైం : డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా మత్తు కలిగించే మందులను విక్రయించరాదని వన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మెడికల్ షాపుల యజమానులు, అసోసియేషన్ ప్రతినిధులతో గురువారం సీఐ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడు ఎం చంద్రశేఖర్, ప్రొద్దుటూరు మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ బ్రహ్మయ్య, మెడికల్ షాపు యజమానులు పాల్గొన్నారు.

ఉపకరణాలకు దరఖాస్తుల స్వీకరణ


ప్రొద్దుటూరు : దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏడీ కృష్ణ కిశోర్

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో గురువారం దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు కృష్ణ కిశోర్ ఆధ్వర్యంలో దివ్యాంగుల నుంచి ఉపకరణాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర సామాజిక న్యాయం సాధికారత సంస్థ సహకారంతో దివ్యాంగులకు అవసరమైన ఉపకరాలను అందిస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గం పరిధి నుంచి దివ్యాంగులు ఉపకరణాల కోసం దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘాల నాయకులు సుబ్బయ్య యాదవ్, అఫ్జల్, షాకీర్ హుస్సేన్, రషీద్, రామసుబ్బయ్య, మహేష్ కుమార్ పాల్గొన్నారు.

150 మంది దరఖాస్తు

చాపాడు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏఎల్ఐఎంసీఓ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సహాయ పరికరాలు మంజూరు చేసేందుకు ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా 150 మంది దివ్యాంగులు దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు గౌస్‌మొహిద్దీన్, టీడీపీ నాయకులు హర్ష, ఐఆర్‌టీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాటం


అభివాదం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : జాతి మనుగడకు, హక్కుల సాధనకు దళితులందరూ ఐక్యంగా పోరాడాలని ఆంధ్రప్రదేశ్ దళితవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వంగిపురం రెడ్డెన్న, దళిత గిరిజన జేఏసీ రాష్ట్ర సమన్వయకర్త దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎన్‌జీవో హోంలో దళితుల భూ సమస్యలు, అట్రాసిటీ కేసుల పరిష్కారంపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలోని దళితులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి, అట్రాసిటీ కేసులు నీరుగార్చే విధానంపై కలిసికట్టుగా పోరాటాలు చేద్దామని పేర్కొన్నారు. అనంతరం దళిత గిరిజన జేఏసీ కమిటీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో డివిజన్ కన్వీనర్లుగా ఎం.పిచ్చయ్య, ఓ.ఎస్.వి.ప్రసాద్, పి.వెంకటరమణ, అధ్యక్షులుగా ముత్యాలప్రసాద్‌రావు, ఉపాధ్యక్షులుగా కేశవయ్య, మురళి, నారాయణ, జకరయ్య, చెంద్రాయుడు, ప్రధాన కార్యదర్శిగా జి.బాలస్వామి, కార్యదర్శులుగా మునెయ్య, రామసుబ్బయ్య, చిన్నయ్య, కేశవ, మౌనిక, కోశాధికారిగా యోహాను, రాజశేఖర్‌లను ఎన్నుకున్నారు. మధ్యాహ్నం నుంచి జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీఓ చంద్రమోహన్ మాట్లాడుతూ దళితుల భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఏపీ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు యల్లయ్య, నాయకులు పిచ్చయ్య, ముత్యాలప్రసాద్‌రావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు గురుమూర్తి, దళితవేదిక రాష్ట్ర జిల్లా అధ్యక్షులు ఓబయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి కృషి

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ రమేష్


మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీల సంక్షేమానికి కృషి చేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ పేర్కొన్నారు. బీసీసెల్ అధ్యక్షునిగా తనను నియమించినందుకు గురువారం తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించారని, రాష్ట్రమంతా పర్యటించి అన్ని బీసీ కులాల వారిని కలిసి వారి సమస్యలను తెలుసుకుని మాజీ సీఎం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బీసీల సమస్యలపై పరిష్కారానికి వివిధ బీసీ కమిటీల ద్వారా నిర్వహించాల్సిన విధుల గురించి మాజీ ముఖ్యమంత్రి తనకు వివరించారన్నారు. బీసీలు ఎప్పటికీ జగన్ వెంటే ఉన్నారని, ఆయనను మరోసారి ముఖ్యమంత్రిగా చేయడానికి కృషి చేస్తామన్నారు.

బీసీలకు చంద్రబాబు అన్యాయం


మాట్లాడుతున్న శివరామ్

మైదుకూరు : నామినేటెడ్ పదవుల నియామకాల్లో చంద్రబాబు మరోసారి బీసీలకు అన్యాయం చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నేట్లపల్లె శివరామ్ ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల్లో చంద్రబాబు బీసీలకు ప్రాధాన్యత ఇవ్వలేదని, నామమాత్రపు పదవులు కేటాయించి బీసీలను నయవంచన చేశారని ధ్వజమెత్తారు. బీసీల పార్టీ టీడీపీ అని చెప్పుకునే చంద్రబాబు నామినేటెడ్ పదవుల్లో బీసీలకు తూతూ మంత్రంగా పదవులను కేటాయించి అగ్రవర్ణాలకు పెద్దపీట వేశారని ఆరోపించారు. సామాజిక సమన్యాయం లోపం స్పష్టంగా కనిపించిందని పేర్కొన్నారు. కేవలం ఎన్నికల్లో ఓట్ల కోసమే బీసీలను చంద్రబాబు వాడుకుంటున్నారని వివర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నామినేటెడ్ పదవుల్లో బీసీలకు పెద్దపీట వేసి బీసీల పక్షపాతిగా నిలిచారని కొనియాడారు. నామినేటెడ్ పదవులతోపాటు నామినేటెడ్ పనుల్లో 50 శాతం కేటాయించి బీసీల ఆర్థిక బలోపేతానికి తోడ్పడ్డారని అన్నారు. అంతే కాకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, జెడ్పీ చైర్మన్ పదవుల్లో జనరల్ స్థానాల్లో కూడా బీసీలకు కేటాయించి జగనన్న బీసీల గుండెల్లో నిలిచిపోయారని అన్నారు.

3 నుంచి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు


ఆహ్వాన పత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ ట్రస్ట్ కమిటీ ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీలలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ అక్టోబర్ 3 నుంచి 13 వరకు 30వ దేవి శరన్నవ రాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆలయంలో గురువారం 30వ దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఆలయాన్ని భక్తుల సహకారంతో పునఃనిర్మించామన్నారు. గతంలో కంటే వైభవంగా దసరా వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అక్టోబర్ 3న రాజరాజేశ్వరి అలంకారం, 4న భవానిదేవి, 5న శారదాదేవి, 6న అన్నపూర్ణాదేవి, 7న శ్రీదేవి వనవిహారిని పార్వతీదేవి, 8న ధనలక్ష్మీదేవి, 9న సరస్వతీ దేవి, 10న మహిషాసుర మర్దిని, 11న శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి, 12న విజయలలితాదేవి అలంకారం చేయనున్నారు. అలాగే రోజూ లోకకల్యాణార్థం వేద పండితుల ఆధ్వర్యంలో వేదపారాయణం, జప హోమాలతోపాటు శ్రీలలితాదేవి అమ్మవారు, రతనాల వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌లకు విశేష అలంకారం చేస్తామన్నారు. భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారి రూపాలను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు


ఎన్జీవో కాలనీలో అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని డీకేటీ, ప్రభుత్వ స్థలాల్లో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎన్జీవో కాలనీ, మహమ్మద్‌కాలనీలలో పర్యటించిన ఆయన అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలను నిలుపుదల చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో భూ వివాదాలు అధికమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ స్థలాలు, డీకేటీ స్థలాల్లో అనుమతి పొందిన తర్వాతనే నిర్మాణాలు చేపట్టాలని కోరారు. చిన్న చిన్న తాత్కాలిక రేకులషెడ్లు నిర్మించడం, వాటికి ఇంటి నెంబరు పొందడం వంటి చర్యలతో సమస్యలు వస్తున్నాయని, ఇందుకోసం తాత్కాలిక నిర్మాణాలకు ఇకపై ఇంటి నెంబరు కేటాయించడం జరగదని సూచించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే వాటిని తొలగించడంతోపాటు ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీ చట్టం - 1965 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యర్థాలు వేస్తే చర్యలు

స్థానిక పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులో భవన నిర్మాణాల, కూల్చివేత వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి హెచ్చరించారు. గురువారం బైపాస్‌రోడ్డులో పర్యటించిన ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇకపై ఎవరైనా బైపాస్‌రోడ్డులో వ్యర్థాలు వేస్తే ఒక వాహనానికి రూ.2 వేలు చొప్పున జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. మున్సిపాలిటీలోని 23 ప్లానింగ్ సెక్రటరీలతో నిఘా ఉంచుతామన్నారు. అలాగే పట్టణంలో భవన నిర్మాణాల, కూల్చివేతల వ్యర్థాలను సీమాంక్ ఆసుపత్రి పక్కన నీటికుంటలో మాత్రమే వేయాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సతీష్‌కుమార్, టీపీబీఓ నరసయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి విడుదలతో పెన్నాపై ఆగిన రాకపోకలు


రామేశ్వరం వద్ద పెన్నానదిలో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

ప్రొద్దుటూరు : మైలవరం డ్యాం నుంచి నీటి ప్రవాహం పెరిగిన కారణంగా ప్రొద్దుటూరు రామేశ్వరం పరిధిలోని పెన్నానదిపై నుంచి ఆర్టీపీపీకి రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం నుంచి తహసీల్దార్ గంగయ్య ఆదేశాల మేరకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిత్యం ఈ నదిపై నుంచి ఆర్టీపీపీతోపాటు ముద్దనూరు, పులివెందుల, కొండాపురం తదితర ప్రాంతాలకు వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగేవి. వేలాది మంది రోజూ ఈ మార్గం మీదుగానే ప్రయాణిస్తుంటారు. రామేశ్వరం ప్రాంతానికి సంబంధించిన రైతులు, ఇల్లూరు, చిన్నదండ్లూరు ప్రాంతాలకు సంబంధించిన పాల వ్యాపారులతోపాటు ఆర్టీపీపీ ఉద్యోగులు నిత్యం ఇక్కడి నుంచి వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం నీటి విడుదల కారణంగా వాహనాల రాకపోకలు ఆగిపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

ఆర్టీసీ బస్టాండ్ జలమయం

భారీ వర్షం ప్రభావం కారణంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌తోపాటు డిపో ఆవరణమంతా జలమయం అయింది. ఈ ప్రభావం కారణంగా ఆర్టీసీ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డిపోలో నీరు నిలిచి ఉండటంతో ఉద్యోగులు మోకాలు లోతులో ఉన్న నీటిలో వెళ్లి విధులు నిర్వహించాల్సి ఉంది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కొత్త బస్టాండ్ నిర్మాణం చేపట్టినా ఇంకా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మైదుకూరు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా గురువారం వనిపెంటలోని జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో కేవీకే ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కేవీకే శాస్త్రవేత్తలు ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. స్వచ్ఛతా హీ సేవాపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతి తరగతిలో ముగ్గురికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేవీకే గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ బీఎస్ కాంతిశ్రీ, పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల, అధ్యాపకులు పాల్గొన్నారు.

■ మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు పరిసరాలను శుభ్రం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పీవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రొద్దుటూరు : స్థానిక వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం స్వచ్ఛతా హీ సేవా-2024పై విద్యార్థులకు వ్యాసరచన పోటీ, చర్చాగోష్టి నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ జయరామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డాక్టర్ ఆర్.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ ఎస్.కిరణ్, హరినాథరెడ్డి, ఫణిరాజు, డాక్టర్ మహబూబ్‌బాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల (అట్లూరు) : మండలంలోని రంగసముద్రం పంచాయతీతోపాటు మిగిలిన పంచాయతీల్లో పంచాయతీ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాయాల వద్ద స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. రంగసముద్రం పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీడీఓ వరప్రసాద రావు, పంచాయతీ ప్రత్యేకాధికారి బాలసుబ్రమణ్యం, కార్యదర్శి రాజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : బి.మఠంలోని వెలుగు కార్యాలయం దగ్గర కంప చెట్లు, పిచ్చిమొక్కలను సిబ్బంది తొలగించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ప్రకాష్, ఈసీలు, ఆనిమేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత పదవి కేటాయించాలి


మాట్లాడుతున్న కృష్ణయ్యయాదవ్, మాదాసు మురళి

ప్రొద్దుటూరు కల్చరల్ : మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్యకు ఆయన స్థాయికి తగినట్లు, ఉన్నత పదవిని కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటకృష్ణ యాదవ్, జిల్లా కన్వీనర్ మాదాసు మురళి పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బచ్చల పుల్లయ్యకు జిల్లావ్యాప్తంగా బీసీల్లో మంచి గుర్తింపు ఉందని, తెలుగు దేశం పార్టీ పటిష్టతకు ఆయన ఎంతో కృషిచేశారన్నారు. ఆయనకు ఒక కార్పొరేషన్ డైరెక్టర్ పదవిని కేటాయించడం దారుణమని అన్నారు. ఆయన ఎన్నికల్లో కూటమి విజయానికి కృషిచేశారని, అటువంటి నాయకునికి చిన్న పదవి ఇచ్చి చిన్నచూపు చూడటం తగదన్నారు. ఎన్నికల్లో బీసీలే తమ పార్టీ వెన్నముక అని చెప్పిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక వారికి తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. బచ్చల పుల్లయ్యకు ఇచ్చిన డైరెక్టర్ పదవిపై పునరాలోచించాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి బీసీలకు ముఖ్యమైన పదవులు కేటాయించాలని ముఖ్యమంత్రికి లేఖ రాయాలని తెలిపారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు వడ్ల శ్రీనివాసాచార్య, జీసీ.పుల్లయ్య, కాలే దేవానంద్, సుబ్బరాజు, బాల పెద్దయ్య, శ్రీనివాసులు, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా పండ్ల మొక్కల పంపిణీ

ప్రొద్దుటూరు : సే ట్రీస్ సంస్థ సహకారంతో సుస్థిర వ్యవసాయ కేంద్రం సంస్థ, ప్రొద్దుటూరు ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని పది మంది రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని పది మంది రైతులకు 14 ఎకరాల్లో నాటేందుకు మామిడి, జామ, అల్లనేరేడు, టెంకాయ, ఎర్రచందనం, చిన్న నిమ్మ, సపోట ఏడు రకాల మొక్కలను ఉచితంగా అందించామన్నారు. ఈ కార్యక్రమంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం సంస్థ కోఆర్డినేటర్ ఆదినారాయణ, అగ్రికల్చర్ ప్రోగ్రాం ఆఫీసర్ రవితేజ, సీఈఓ పవన్‌కుమార్, ముమ్మడిరెడ్డి నరేంద్రరెడ్డి, విత్తన ప్రోగ్రాం ఆఫీసర్ జనార్దన్, కిసాన్ మిత్ర ఫీల్డ్ కోఆర్డినేటర్ జయన్న, ఏజే బయో ఫర్టిలైజర్స్ అధినేత అభిషేకం, న్యాచురల్ ఫార్మింగ్ ఫీల్డ్ కోఆర్డినేటర్ నాగవేణమ్మ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పోరుమామిళ్ల (అట్లూరు) : పోరుమామిళ్ల పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న ఐపతి తిరుపాలమ్మను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఆర్.వి.కొండారెడ్డి తెలిపారు. ఆమె వద్ద నుంచి 24 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.